# "కటికి చీకటి"

వి. కుటుంబరావు.

★

రాత్రి 10 గంటలయింది. లక్ష్మి పసిపాపకు పాలిచ్చి నిద్రబుచ్చింది. పెదబ్బాయి ముద్దుమాటలు చెప్పిచెప్పి పండుకొన్నాడు. తల్లి యిద్దరు బిడ్డలవంక విచారంగా చూస్తోంది. గోడకు తగిలించియున్న పటంవంక ఒక్కసారి తలెత్తిచూచింది. మరల దృష్టిని బిడ్డలవైపుకు మరల్చింది. ఆమె కనుగొలకలలో రెండు బాష్పబిందువులున్నాయి. దీపంలో చమురులేక కండిగట్టింది. గదిలో వెలుతురు క్రమంగా తగ్గిపోతూంది.

లక్ష్మిభర్త రామం. మంచిసంసారమే మొదట్లో. స్కూలుఫైనల్‌వరకూ చదివాడు. 4 ఎకరాల పొలం. యిల్లూ, పశువులూ యుండేయి. తన తండ్రి తీర్చలేక యిచ్చిన 400 రూ॥లు ఋణం తన పొలాన్నంతనూ లాగేసింది. దారుణమైన శిస్తులకే చాలని యీ పంటలతో, ఋణాలెట్లా తీరుతయ్ యీ పేదరైతుకు? అమ్మదామంటే షావుకారు కోటయ్య చౌకగా పారవేయమంటాడు. పేదరైతులంతా దాదాపు తన స్థితిలోనే యున్నారు. గవర్నమెంటు భూ తనఖా బ్యాంకులో అప్పు తెచ్చుకుందామంటే 50 రూ॥లు యుద్ధఫండీయందే లాభంలేదన్నారు. కాలం గడిచినకొలది, వడ్డీపెరిగిపోయి, ఋణం క్రింద 4 ఎకరాల్నీ ఋణదాత కాజేశాడు. ఎద్దుబండీ, దూడా, దుక్కి, అన్నీపోయాయి. కళకళలాడే సంసారం నేడు యీవిధంగా అయిపోయింది.

రామం చాలా మంచివాడు. దుర్గుణాలేవీలేవు. లక్ష్మిఅంటే ఎంతో ప్రేమగా యుండేవాడు. తనకటువంటి భర్త లభించినందులకు లక్ష్మి గర్వించేది. అనుకూలదాంపత్యమగుటచే యీ కష్టకాలంలో గూడా, ఉన్నా లేకపోయినా, గుట్టుగా బ్రతుకుతున్నారు. కాని హృదయాలుమాత్రం దహించుకపోతున్నాయి. ఏంలాభం! ఏంచేయగలరు? అన్నీ స్పష్టంగా కాన్పించుతున్నాయి. తనతోటి రైతు వెంకయ్య వడ్డీవ్యాపారంతో 40 ఎకరాల పొలం సంపాదించాడు. కోటయ్య చౌకగా పొలాలు తాకట్టు పెట్టించుకొని, ఋణగ్రస్థులైన పేద రైతుల పొలాలను నూటికో, ఏభైకో లాగేసి, 200 ఎకరాలు కూడబెట్టాడు. వడ్ల ఫ్యాక్టరీ యజమాని, ఎలాగైతే 2 లక్షలు సంపాదించాడు. 4 ఫ్యాక్టరీలు కట్టించాడు. ఇదివరకు ఊళ్లో రైతులందరకీ పొలాలుండేయి. అంతా తినేవారు. నేడంతాపోయింది. ముగ్గురు తేలారు. వారిమీద యీ పేదరైతులంతా (వ్యవసాయ కూలీలు) బ్రతకాలి. ఈ గ్రామానికి పోషణదార్లు ఆముగ్గురే యిప్పుడు.

రాత్రి 12 గంటలయింది. రామం యింకా యింటికి రాలేదు. లక్ష్మి అలాగే కూర్చునియుంది. మరల గోడవంక చూచింది. బాగాయున్నరోజుల్లో, రామం ఫుటో అది. చక్కని క్రాపు, ఫ్రెంచి కటింగ్ మీసాలు. చక్కని కోటు, గళ్లనిల్‌టై. దర్జాగాయుంది. ముఖం కళకళలాడుతోంది.

ఆమెకళ్లనుండి ఒకటే ప్రవాహం, నీటికణాలా? ... అగ్నికణాలా? ... "రామం యీవేళ ప్రొద్దున పోయాడు. ఎక్కడకు? ఏమో? సంపాదనకై యుంటుంది. చినిగిపోయిన నల్లగళ్ల చొక్కా, ఎర్ర మిలియారన్

పంచె, పాతపంచె తలపాగాతో లక్ష్మీ వస్తా అని కొంతదూరంపోయి, మరల తిరిగి వచ్చారు ...లక్ష్మీ యీ దోపిడీప్రపంచంలో, దోపిడీ చేయబడ్డ కుటుంబాలలో మనదొకటి కాని ఏం చేయను? అంతాపోయింది. సర్వం శూన్యంగా కాన్పిస్తోంది. మనం యీ కష్టదినాల్లో ఒకళ్ల నొకళ్లు ఓదార్చుకొంటూ కాలంగడిపాము. కాని..!యిక దుర్లభం, పసిపాపల పాల ముఖాలు చూడు. లక్ష్మీ! ఎలాకళకళలాడు తున్నాయో,... యీగులాబీరంగు చెక్కిళ్లే నేడు గాపోయినా, ఎప్పుడో ఒకనాడు ఆకలిగుండలో మాడిపోయి తీరుతాయి. అబ్బ! లక్ష్మీ ఆదృశ్యం నేచూడలేను, అంటూ కళ్ల నీరు పెట్టుకొని బయలుదేరారు!

ఎంత అవసపడుతున్నారో మాకోసం. ఆయనొక్కరైతే ఎలాగోలా తంటాలుపడి సంపాదించుకగ్గలేవారే! ఈ దోపిడీ ప్రపంచంలో, భార్యాభర్తలు పిల్లల్తో ఆనందంగా కాలంగడిపే సౌఖ్యంలేదా?

గడియారంనంక చూచింది. రాత్రి ఒంటిగంటయింది ఆవేదనెక్కువైంది. రామం యింకారాలేదు. అప్పుడప్పుడనేవారు లక్ష్మీ మనం సంఘంచే దోపిడీ చేయబడ్డాము. రేపు ప్రభుత్వమే మనకు......'' ఏం ప్రమాదం కల్గిందో.

బయటకు వచ్చింది. కటికి చీకటి. మరల లోనికిపోయింది. నూనె లేక టప్ టప్ మని దీపం ఆరిపోయింది. యిల్లంతా కటికి. చీకటయింది. ఇల్లా లేక ఆమె హృదయమా!....గెండూనేమో? ఆకలిమంటతో ఆమెహృదయం దహించుకపోతోంది. మగత వచ్చి కన్నులు మూసుకొంది.

ఎప్పుడొచ్చాడో రామం పాతచాపపై పండుకొని యున్నాడాకటికిచీకట్లో. ఒక్కసారి హడావుడిగా బ్యాటరీలైట్ల వెలుతుర్లో యిల్లంతా తెల్లబడింది, రామం కన్నులు నులుముకుంటూ లేచాడు. లక్ష్మి కంగారు పడి మంచంపైనుండి క్రిందికి దిగింది. పసిపాపలిరువురూ నిద్రిస్తున్నారు. పాపం వాళ్లకేం తెలుసు తల్లిదండ్రుల హృదయావేదన.

అంతా పోలీసులు.

రామాన్ని అరెస్టుచేశారు. ఎందుకు? అతనిజేబులో "స్వతంత్ర భారత్'' అనే కమ్యూనిష్టుపార్టీ పత్రిక యుండట—కోట్ల కొలదీ ప్రజలను మోసంతో దోపిడీచేసి, కొద్దిమంది వ్యక్తులు జాతీయసంపదనంతా, అనుభవిస్తున్నారు. యీదోపిడీవర్గాన్ని నాశనం గావించి, కష్టజీవుల పరిపాలన ఏర్పరచాలి. 'కార్మికులకు తిండి, కర్షకులకు భూమి, ప్రజలకు శాంతి కావాలి' అని బోధించే కమ్యూనిష్టులలో రామం ఒకడని, నేను నమ్ముతూ, దేశరక్షణ చట్టంక్రింద యితనికి 18 మాసములు కఠినశిక్ష విధించుచున్నాను.

[కోర్టుతీర్పు].

లక్ష్మీ, పాలబుగ్గల పసిపాపలు. ఏమైయుంటారు?